క్లుప్తంగా

న్యూఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి


మాట్లాడుతున్న ఎస్‌ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ వైన్ షాపులు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి మూసివేయాలన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అశ్లీల నృత్యాలు, డీజే సౌండ్స్, రికార్డింగ్ డ్యాన్స్‌లు, మత్తు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని ప్రోత్సహించకూడదని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాలకు ఇబ్బంది కలిగించకూడదన్నారు. వాహనాలను ఓవర్ స్పీడ్‌లో నడపడం, ప్రమాదకరమైన డ్రైవింగ్, బైక్‌లపై త్రిబుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్మశాన వాటికకు దారి కల్పించండి


తహసీల్దారుకు వినతులు అందజేస్తున్న గ్రామస్తులు

సత్యవేడు: మండలంలోని జడేరి ఎస్సీకాలనీకి ఉన్న శ్మశాన వాటికకు దారి వసతి కల్పించాలని కాలనీ వాసులు రెవెన్యూ అధికారులను కోరారు. సోమవారం రెండు గ్రామాల పరిధిలో స్థానిక పాఠశాల ఆవరణలో సర్పంచులు బుజ్జమ్మ, జయంతి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 15 అర్జీలు అందాయి. కార్యక్రమంలో తహసీల్దారు టి.సుబ్రమణ్యం, ఆర్‌ఐ సురేష్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వీకేఎస్ పరమశివం(బాషా), వీఆర్‌ఓ శేఖర్, డిజిటల్ అసిస్టెంట్ చంద్ర, నాగార్జున, బాబు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపండి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న చిరువ్యాపారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం వారు ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించడం వల్ల వారు వీధిన పడ్డారన్నారు. వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం వారికి ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. అందుకు ఆర్డీఓ సానుకూలంగా స్పందించారు.

భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాళమ్మ ఆలయం వద్ద సోమవారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ప్రతి అమావాస్యకు భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని వినతి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న దళితులు, గిరిజనులు

సత్యవేడు: మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీలో నివశిస్తున్న దళితులు, గిరిజనులు 150 కుటుంబాలకు ఇంటి స్థలాలు, సాగుభూమి పంపిణీ చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక ఎంపీటీసీ మోహన్ ఆందోళన చేపట్టారు. పంచాయతీ పరిధిలో అగ్ర వర్ణాలకు చెందిన వారు ప్రభుత్వ భూమలను ఆక్రమించి నీలగిరి తగిలం తోటలు సాగు చేస్తున్నారన్నారు. వారి ఆధీనంలో ఉన్న భూమిని పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు భూపంపిణీ చేయకపోతే ఆందోళన చేపడతామని సీపీఐ నాయకుడు చిన్న రాజ్ హెచ్చరించారు. 2003లో ఇచ్చిన ఇంటిపట్టాలు నేటికీ లబ్ధిదారులకు చూపలేదన్నారు.

నిర్దేశించిన సమయానికే పింఛన్ల పంపిణీ

వరదయ్యపాళెం: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రసాద్ ఆదేశించారు. ఆ మేరకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 31, జనవరి 1, 2 తేదీల్లో పింఛన్ల పంపిణీ జరగాలని ప్రధానంగా 31వ తేదీ నాటికి పూర్తయ్యే విధంగా సిబ్బంది చొరవ చూపాలన్నారు.

బువ్వ పెట్టని.. బుట్ట

అనాదికాలం నుంచి గిరిజన బిడ్డలు చేతివృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. రేణిగుంట మండలంలోని చెంగారెడ్డిపల్లి గిరిజన కాలనీ వాసులు గతంలో వెదురు బుట్టలు అల్లుకుని జీవించేవారు. అయితే అడవిలో వెదురు కొయ్యలు కొట్టడానికి వారిని ఫారెస్టు అధికారులు అనుమతించకపోవడంతో ఈత పుల్లలను తెచ్చి బుట్టలు అల్లుకునేవారు. అదీ గిట్టుబాటు కాకపోవడంతో దళారుల వద్ద వెదురు కొయ్యలను కొని, బుట్టలు అల్లి విక్రయించే వారు. వరుస నష్టాలు వస్తుండడంతో ప్రత్యామ్నాయంగా పారకలు అమ్ముకునేందుకు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయారు. గ్రామంలో ఉన్నవారు మాత్రం ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.


బుట్టలు అల్లుతున్న గురవయ్య


బుట్టలు అల్లేందుకు ఉపయోగించే ఈత పుల్లలు

- అనాది కాలం నుంచి చేతివృత్తిపైనే ఆధారపడిన గిరిజనులు
- నాణ్యమైన బుట్టలకు కేరాఫ్‌గా చెంగారెడ్డిపల్లి గిరిజన కాలనీ
- గతంలో వెదురు బుట్టలు అల్లి విక్రయించుకునే వారు
- అడవిలో వెదురు కొయ్యలు తీసుకెళ్లనివ్వని ఫారెస్టు అధికారులు
- చేతివృత్తిని వదిలి పొరుగు రాష్ట్రాలకు వలస
- ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూపు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): దశాబ్దాల తరబడి చేతివృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న గిరిజన బిడ్డలు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చెంగారెడ్డిపల్లి గిరిజన కాలనీ వాసులు 60 కుటుంబాల వారు ఎన్నో దశాబ్దాలుగా వెదురు బుట్టల అల్లికలనే జీవనాధారంగా ఎంచుకున్నారు. గతంలో 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మామండూరు అటవీ ప్రాంతం నుంచి ఎదురు కొయ్యలను తెచ్చుకుని బుట్టలు అల్లేవారు. కానీ అటవీశాఖ అధికారులు అడవి నుంచి తీసుకుని వెళ్లేందుకు అనుమతించకపోవడంతో దళారుల వద్ద ఎదురుకొయ్యలను కొని బుట్టలు అల్లడంతో నష్టాలు రావడంతో వెదురు బుట్టలను అల్లడం ఆపేశారు. ఈత పుల్లలతో బుట్టలు అల్లుతూ జీవనం సాగిస్తున్నారు. ఈత పుల్లలు కూడా దొరక్కపోవడంతో చేసేదేమీ లేక చేతివృత్తిని పక్కనపెట్టి చాలా కుటుంబాలు పారకలు వ్యాపారం చేసుకునేందుకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వలస వెళ్లారు. గ్రామంలో ఉండే కొందరు మాత్రం చేతి వృత్తిని విడిచి పెట్టలేక నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం ఏమైనా ప్రోత్సాహం కల్పించకపోదా అని ఎదురు చూస్తున్నారు.

వెదురు బుట్టలకు చెంగారెడ్డిపల్లి ప్రసిద్ధి..

రేణిగుంట మండలమే కాక చుట్టుపక్కల గ్రామాల్లో ఏ శుభకార్యం జరిగినా చెంగారెడ్డి పల్లి గిరిజన కాలనీకి వచ్చి ఎదురు బుట్టలను తీసుకెళ్లేవారు. నాణ్యతతో మంచి బుట్టలు దొరికే గ్రామంగా చెంగారెడ్డి పల్లి గిరిజన కాలనీ ప్రసిద్ధిగాంచింది.

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు

60 గిరిజన కుటుంబాల వారు ప్రస్తుతం వెదురు కొయ్యలు దళారుల వద్ద కొని బుట్టలు అల్లలేక చేతివృత్తికి దూరమవుతున్నారు. ప్రభుత్వం తరఫున సబ్సిడీ రుణాలు, వెదురు కొయ్యలు సబ్సిడీపై అందిస్తే మళ్లీ గ్రామానికి పూర్వ వైభవం వచ్చి ఎక్కడికీ వలస వెళ్లకుండా చేతివృత్తిని చేసుకుని జీవిస్తామంటూ గిరిజనులు అంటున్నారు.

ప్రోత్సాహం లేదు..



అడవిలోకి వెళ్లి వెదురు బొంగలు తెస్తే ఫారెస్ట్ అధికారులు కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. బయట కొని బుట్టలు అల్లితే నష్టాలు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి సబ్సిడీ రుణాలు అయినా ఇస్తే పెట్టుబడిగా పెట్టుకుని చేతివృత్తిని కొనసాగిస్తాం.

– వెంకటమ్మ, గిరిజన కాలనీ, చెంగారెడ్డిపల్లి

పారకలు అమ్ముకుంటున్నారు



చేతివృత్తిని చేసుకుంటూ ఉన్న ఊరిలో బతుకుతున్న మా వాళ్లంతా ప్రస్తుతం బుట్టల అల్లకంతో లాభాలు రాకపోవడంతో బతుకుదెరువు కోసం పారకలు అమ్ముకునేందుకు ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. ప్రభుత్వం మాలాంటి వాళ్లపై దయచూపి ప్రోత్సాహం అందిస్తే ఉన్న ఊరిలోనే పని చేసుకుని బతుకుతాం.

– రేణుకమ్మ, గిరిజన కాలనీ, చెంగారెడ్డిపల్లి

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఏండ్ల తరబడి చేతివృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న 60 గిరిజన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. వెదురు కొయ్యలను సబ్సిడీ రూపంలో గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం సరఫరా చేయాలి. చేతివృత్తిపై ఆధారపడి జీవించే గిరిజనులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి గిరిజనులను ఆదుకోవాలి..

– కె.హరినాథ్, ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): నూతన సంవత్సర వేడుకల్లో అల్లర్లు సృష్టించినా.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ పైడేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31న రాత్రి నిర్దేశించిన సమయం వరకు మాత్రమే హోటళ్లు, మద్యం దుకాణాలు నిర్వహించుకోవాలని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు, ఉద్యోగులు ఉన్న శ్రీసిటీ పారిశ్రామిక వాడలో తప్పనిసరిగా నిర్దేశించిన సమయాన్ని పాటించి సహకరించాలని కోరారు. ఆ మేరకు రాత్రంతా సిబ్బందితో గస్తీ నిర్వహిస్తామని, తనిఖీలు చేపడతామని తెలిపారు. ప్రతిష్టాత్మక ప్రాంతమైన పారిశ్రామికవాడ ప్రాంతంలో ఏ చిన్న సంఘటన జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకుందాం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందామని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. రేణిగుంట డీఎస్పీ సోమవారం పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ 31వ తేదీ రాత్రి రేణిగుంట పట్టణంతో పాటు గాజులమండ్యం పోలీస్ స్టేషన్, ఏర్పేడు మండలంలోని రోడ్లలో చెక్‌పోస్టులు, పికెట్‌లను ఏర్పాట్లు చేసి రాత్రి 10 గంటల నుంచి వాహనాలను తనిఖీ చేయడం ప్రారంభించి, తెల్లవారుజామున వరకు కొనసాగుతుందన్నారు. వైన్‌షాపులు, బార్‌లను ప్రభుత్వం నిర్దేశించిన నిరీత సమయంలో మూసేయాలని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో బ్రీత్ ఎనలైజర్లకు పట్టుబడిన వ్యక్తులను మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు పంపడం జరుగుతుందన్నారు. నూతన సంవత్సర వేడుకలను సాకుగా చూపి బైక్‌లు, కార్లను రేసింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముక్కంటి సేవలో కేంద్రమంత్రి


శ్రీకాళహస్త ఆలయం వద్ద కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి

శ్రీకాళహస్తి: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు గణపతి రావు జాదవ్ సోమవారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వరిపంట పరిశీలన


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రైతులు నత్రజని ఎరువులను తగు మోతాదులో వాడాలని ఏడీఏ రమేష్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం తొండమనాడు గ్రామంలో సోమవారం రైతులతో కలిసి శ్రీకాళహస్తి వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్ రెడ్డి పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పంటను చీడ పీడలు ఆశించాయన్నారు. పంటను ఆశించిన ఉల్లికోడు నివారణకు ఎకరాకు పర్ధన్ గుళికలు ఎనిమిది నుంచి పది కిలోలు వాడుకోవాలని సూచించారు. వరి పైరుకు రైతులు యూరియా లాంటి నత్రజని ఎరువులు ఎక్కువగా వాడుతుంటారని, అయితే తగు మోతాదులో మాత్రమే వాడాలన్నారు. యూరియా ఎక్కువగా వాడడం వల్ల వరి పంటకు తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తింటే.. అనారోగ్యమే



శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కొందరు తినుబండారాలు అమ్ముతున్నారు. అయితే వాటిపై కనీసం పేపర్లు వంటివి కూడా కప్పడం లేదు. ఈగలు వాలుతున్న తినుబండారాలను తింటే అనారోగ్యం బారిన పడతారని తెలియక చిన్నారులు వాటినే కొని తింటున్నారు. విక్రయదారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా అలాంటి ఆహార పదార్థాలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – శ్రీకాళహస్తి

భార్యాభర్తకు తీవ్ర గాయాలు


లారీ ముందు చక్రం కింద ఇరుక్కుపోయిన బైక్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం మర్రిగుంట సమీపంలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని నల్లపాళెం గ్రామంలో నివాసం ఉంటున్న ప్రసాద్ (44), అలివేలు (35) ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి వస్తున్నారు. మర్రిగుంట సమీపంలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై సోమవారం రాత్రి 7 గంటల సమయంలో లారీ ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఇరువురిని తిరుపతి రుయా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గాజులమండ్యం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇద్దరికీ పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

టీడీపీ, జనసేన మౌనం ఎందుకు ?



శ్రీకాళహస్తి : నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు


సత్యవేడు: ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

శ్రీకాళహస్తి: నిమ్న వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానపరిచేలా మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద సోమవారం సీపీఎం, సీపీఐ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పీసీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను కూటమి నేతలు ఎందుకు మాటాడడం లేదన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం అంబేడ్కర్ పేరును వాడుకునే టీడీపీ, జనసేన నేతలు పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానం జరిగితే ఎందుకు మౌనం దాల్చారో చెప్పాలని ప్రశ్నించారు. అమిత్‌షాపై చర్యలు తీసుకునేవరకు అఖిలపక్ష పార్టీలు కూడా ఆందోళనలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నేతలు పాల్గొన్నారు.

బీజేపీది నియంతృత్వ ధోరణి..

సత్యవేడు: పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సీపీఎం, సీపీఐ వామపక్షాల నాయకులు ధర్నా చేపట్టారు. సోమవారం అంబేడ్కర్ విగ్రహం సమీపంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్, సీపీఐ సత్యవేడు ఏరియా కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ పేదలను, అణగారిన వర్గాల వారిని, దళితులను, గిరిజనులను మరింత కిందకు దిగజారుస్తూ ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు లక్షల కోట్లు రూపాయలు కట్టబెడుతూ దేశ సంపదను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటులో జమిలీ ఎన్నికల బిల్లు ఆమోదం పొందాలంటే 3 వంతుల్లో రెండోవంతు మెజారిటీ ఉంటే తప్ప ఈ బిల్లు పాస్ కాని సంగతి తెలిసిందే అన్నారు. అయినా కూడా నియంతృత్వ ధోరణిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి జేపీసీ కమిటీకి పంపి రాజ్యాంగాన్ని మంటకలిపే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుప్పట్ల వితరణ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ధర్మరాజుల ఆలయం వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల వసతిగృహంలో సోమవారం శ్రీసత్యసాయి అన్నదాత ప్రసాద, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ కోవనూరు శాఖ మేనేజరు రమేష్, ట్రస్టు సభ్యులు పాండురంగయ్య, మిద్దెల రామయ్య, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కట్టడిపై నిఘా పెట్టండి


నాగలాపురం పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న పుత్తూరు డీఎస్పీ రవికుమార్

నాగలాపురం: స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సోమవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు స్టేషన్ పరిసరాలు, భవనాలను పరిశీలించారు. అనంతరం ఆయన గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో గల రిసెప్షన్ సెంటర్, రైటర్, లాకప్ గదులు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీలు, రికార్డులు, ఇతర రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విచారణలో ఉన్న కేసుల పురోగతి, దర్యాప్తు జరుగుతున్న తీరు, తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. నమోదైన కేసులకు సంబంధించిన ప్రతి అంశాన్ని సీసీటీఎన్‌ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. అలాగే పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును రిసెప్షన్‌లో నమోదు చేసి రసీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సత్యవేడు సీఐ మురళినాయుడు, ఎస్‌ఐ సునీల్, ఏఎస్‌ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

విరిగి పడిన చెట్టు కొమ్మలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాయలమండపం పక్కనే ఉన్న పగడ చెట్టుకొమ్మలు సోమవారం రాత్రి విరిగి పడ్డాయి. అయితే సమయానికి ఎవరూ ఆ ప్రాంతంలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ చెట్టు 300 ఏళ్లుగా ఉందని అంటుంటారు. సాధారణ సమయాల్లో ఈ చెట్టు కింద భక్తులు పెద్దసంఖ్యలో సేద తీరుతుంటారు. రెండు భారీ కొమ్మలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వేర్లకు నీరు సక్రమంగా వెళ్లకపోవడం వల్లే చెట్టు బలహీనపడి కొమ్మలు విరిగిపడినట్లు ఆలయ అధికారులు భావిస్తున్నారు.